విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సయ్యద్ హబీబున్నీసా అనే విద్యార్థినికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'కాంప్రెహెన్సివ్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ట్రిటియా టింక్టోరియా సీడ్ ఫైబర్స్ బేస్డ్ సిమెంట్ కాంపోసిట్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేసిన దివంగత డాక్టర్ ఎన్.రూబెన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన సయ్యద్ హబీబున్నీసాను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

దూర విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) దూర విద్య కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్‌మీడియట్ ప్రవేశం పొందడానికి ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31వ తేది లోగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నండి ఉండాలని, పది ఉత్తీర్ణులై ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

విజయవాడ ఫిలింసొసైటి అధ్యక్షులు జంపా కృష్ణకిషోర్ మృతికి సంతాపం

విశాలాంధ్ర - తెనాలి : విజయవాడ ఫిలిం సొసైటీ అధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్ మృతి పట్ల తెనాలి కల్చరల్ ఫిలింసొసైటీ, చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, ఇస్కఫ్ సంస్థలు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెనాలి ఫిలిం సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి వీరనారాయణ తన సంతాపంలో ఫిలిం సొసైటీ తెనాలి కార్యక్రమాలు విస్తృతంగా పాల్గొని సలహాలు యిచ్చేవారని, కార్యకర్తగా పనిచేసే వారని, ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఇస్కఫ్ నాయకులు పి.నారాయణరావు, బెజ్జంకి నాగమణి, శ్రీదేవిలు తమ సంతాపాన్ని ప్రకటించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి సంతాపం తెలుపుతూ జనవిజ్ఞాన వేదికలో ప్రముఖపాత్ర వహించారని, విజయవాడలో జాతీయ సభలు నిర్వహించారని వారి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ప్రభుత్వ సేవలకు తోడుగా మా వంతు వైద్య సేవలు

- కోస్టల్ కేర్ హాస్పిటల్ ఎండీ మురళీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పేద ప్రజలకు వైద్య పరంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలకు గానూ తమ వంతు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో గుంటూరు పట్టణంలోని అన్ని మారుమూల ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని కోస్టల్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ కె.మురళి అన్నారు. రాష్ట్ర పురోభివృద్ధి ఆ రాష్ట్ర వైద్య, విద్య సేవలుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ మేరకు స్వర్ణముఖి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కోస్టల్ కేర్ హాస్పిటల్ వారు స్థానిక గొలుసు నాంచారమ్మ-కొండలరావు స్కూల్ సమీపంలో ఉన్న 'మన ఆప్టికల్' నందు మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన సుమారు వంద మంది పేషెంట్‌లకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, డెంటల్‌లతో పాటు రక్త పరీక్షలు కూడా ఉచితంగా చేశారు. ఈ శిబిరానికి వచ్చి చూయించుకున్న పేషంట్లకు ఓపీ, రక్త పరీక్షలు, మందులలో రాయితీ ఇవ్వనున్నట్లు ఎండీ మురళీ పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో కోస్టల్ కేర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్వర్ణముఖి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల ఉన్నతికి కట్టుబడిన సీఎం జగన్

- ఏఎంసీ వైస్ చైర్మన్ సుభాని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముస్లింల ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డ్)వైస్ చైర్మన్ షేక్.సుభాని అన్నారు. ముస్లిం మైనార్టీల పక్షపాతిగా సీఎం జగన్ చేస్తున్న పరిపాలన వలనే ఇది సాధ్యమైందని, తమ వారిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా చేయడంతో పాటు నామినేటెడ్ పదవులలో కూడా అత్యధికత ప్రాధాన్యత ఇచ్చి అన్ని రంగాల్లో బలోపేతం చేసే దిశగా సీఎం ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తన నియామకమే అందుకు నిదర్శనమని ఆయన వెల్లడించారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్ లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో షేక్ సుభాని మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం మైనారిటీల భద్రతకు, సంక్షేమానికి, ఉన్నతికి అనేక నిర్ణయాలు తీసుకోవడమే కాక వాటిని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మార్కెట్ బాబు, షేక్ రోషన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా చైర్మన్ షేక్ ఫరియాజ్, డైరెక్టర్ షఫి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ మున్నా, మౌలాలి, ఆసిఫ్, బాషా, సిద్ధిఖ పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో సీపీఐ కార్యాలయంలో మంగళవారం చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు అధ్యక్షతన సీపీఐ నియోజకవర్గ సమితి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారాందోళన కార్యక్రమం జయప్రదంగా నిర్వహించాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏరు దాటినాక తెప్పతగలేసిన చందంగా వ్యవహరిస్తూ ఇప్పటికీ లెక్కలేనన్నిసార్లు పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులను చిన్నాభిన్నం చేశారన్నారు. దేశంలో ఉన్న పారిశ్రామిక రంగాన్ని గౌతమ్ అదాని, ముకేశ్ అంబానీ లాంటి స్వదేశీ గుత్త కోటీశ్వరులకు కారు చౌకగా అమ్ముతూ భారతదేశ పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టారన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ బీజేపీ అంటే బి అంటే బాబు జె అంటే జగన్ పి అంటే పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. దేశంలో మతోన్మాదం రోజు రోజుకి పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ దుష్టశక్తుల అరాచకాలు రోజురోజుకీ అంతులేకుండా పెరిగిపోతున్నాయని, మణిపూర్ ఘటనల వెనుక ఆర్ఎస్ఎస్ పాత్ర ఉన్నదనేది వాస్తవమన్నారు. ప్రపంచ వ్యాప్తముగా మణిపూర్‌లో జరుగుతున్న రాక్షసాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారని ఇప్పటికీ మోదీ పర్యటన మణిపూర్‌లో లేకపోవడం తన మతోన్మాద వైఖరికి అద్దం పడుతుందన్నారు. హోం మంత్రి అమిత్ షా మణిపూర్ ముఖ్యమంత్రి సింగ్ మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ బాపట్లలో, జిల్లా సభను దుగ్గిరాలలో జరపనున్నారని అన్నారు. నియోజకవర్గం నుంచి అన్ని గ్రామాలు వారు వ్యవసాయ కార్మిక సభ్యులను మమేకం చేయాలని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, అప్రజాస్వామిక, ధరల పెరుగుదలకు నిరసనగా ఈ నెల 17వ తేదీ విశాఖపట్నం నుంచి ప్రారంభమై 26వ తేదీన మంగళగిరిలో చేనేత రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. అలాగే తుళ్లూరు రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 26 వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బత్తూరి మోహన్రావు మాట్లాడుతూ మంగళగిరి చేనేత రౌండ్ టేబుల్ సమావేశాన్ని చేనేత కార్మిక సంఘ సభ్యులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కంచర్ల కాశయ్య, జాలాది జాన్ బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్, గుంటక సాంబిరెడ్డి, కళ్ళం శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, పంతగాని మరియదాసు, మానికొండ డాంగే, రామారావు, గోహార్ జానీ, శివయ్య, కరీముల్లా, జి.శివ, వెంకట్రామయ్య, వెంకటయ్య, శ్రీను, నాగేశ్వరరావు, ఆళ్ళమూడి హానొక్ బాబు, నాగరాజు, ఉడత శ్రీనివాసరావు, షేక్ జాన్, సైదా, గురునాథం, శివప్రసాద్, యార్లగడ్డ శివ, గోపి, అభి, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నిడమర్రు రోడ్డులోని రైతు బజార్‌ను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సందర్శించారు. జాయింట్ కలెక్టర్ మార్కెట్ యార్డ్‌లో సివిల్ సప్లై గోడౌన్స్‌ను పరిశీలించిన అనంతరం యార్డ్ ఆవరణలోని రైతు బజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రైతు బజార్లో ఎన్ని షాపులు ఉన్నాయి, రోజుకు రైతు బజార్‌కు ఎంతమంది వినియోగదారులు వస్తున్నారు, నిర్వహణ విధానాన్ని ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన టీచర్స్ తమ స్కూలుకు చెందిన విద్యార్థులకు రైతులు పండించే కూరగాయలు, రేట్లు, విక్రయాలపై అవగాహన కల్పించేందుకు రైతు బజార్‌కు తీసుకొచ్చారు. దీంతో జాయింట్ కలెక్టర్ రాజకుమారి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి, రైతులు తాము పండించిన పంటను రైతు బజారుకు తీసుకువచ్చి ఎలా విక్రయిస్తారో విద్యార్థులకు వివరించారు.

తొమ్మిదేళ్ల చిన్నారికి విజయవంతంగా చికిత్స

విశాలాంధ్ర - గుంటూరు : గ్రేడ్ ఐవి కేంద్ర నాడీ వ్యవస్థ కణితి అయిన గ్లియోబ్లాస్టోమా మల్టీఫార్మ్ (జిబిఎమ్) (హై గ్రేడ్ బ్రెయిన్ ట్యూమర్)తో బాధపడుతున్న 9 ఏళ్ల చిన్నారికి విజయవంతంగా చికిత్స అందించడం ద్వారా ఒక అద్భుతమైన మైలురాయిని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ) గుంటూరు చేరుకుంది. మెదడు క్యాన్సర్ యొక్క ఈ కణితి కారణంగా తలనొప్పి, వికారం, వాంతులు, అవయవాల బలహీనత వంటి తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. దీనికి తక్షణ, ప్రత్యేక శ్రద్ధతో పాటుగా సమర్థవంతమైన చికిత్స కూడా అవసరం పడుతుంది.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

విశాలాంధ్ర - తెనాలి : ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు తెనాలి మున్సిపల్ కార్పొరేషన్ దగ్గర తెనాలి యూనిట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ముఖ్యమంత్రి న్యాయం చేయలేదని చెప్పారు. ఆటో డ్రైవర్లకు 18500 జీతం చెల్లిస్తామని చెప్పిచాలా తగ్గించి ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, అధ్యక్షురాలు ఎం. పద్మ, సుధాకర్, వెంకటేశ్వర్లు, సుశీల, దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

యువగళాన్ని జయప్రదం చేయాలి : సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్లో యువత విద్యార్థులతో పాటు నిరుద్యోగులను నయవంచన చేసిన వైసీపీ సర్కారుకు చరమగీతం పాడేందుకు యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున యువగళంలో పాల్గొని జయప్రదం చెయ్యాలని గుంటూరు జిల్లా తెలుగుయువత తెలుగుయువత అద్యక్షుకులు రావిపాటి సాయి కృష్ణ పిలుపునిచ్చారు. యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వినుకొండ నియోజకవర్గంలోకి నూజెండ్ల మండలం ముత్తరాజువారి పాలెం వద్ద ప్రవేశించిన సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ముఖ్యనేతలతో కలిసి ఘన స్వాగతం పలికి సాయి కృష్ణ పుష్పగుచ్ఛం అందజేశారు.

నల్లమడ రైతులు అరెస్ట్

విశాలాంధ్ర-పెదనందిపాడు: నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయు ప్రయత్నంలో పెదనందిపాడు పోలీస్ స్టేషన్లో రైతులను అరెస్టు చేశారు. మాజీ ఎంపీపీ నర్రా బాల కృష్ణను గృహనిర్బంధం చేశారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో అరెస్ట్ అయిన రైతు నాయకులు బోడవాడుగు చెందిన కన్నెగంటి సాంబశివరావు, చెరుకూరి దొరబాబు, శృంగవరపు సుబ్బారావు, తిక్కరాజుపాలెం కు చెందిన దుప్పలపూడి మంజూష, దేవరపల్లికి చెందిన ముప్పాళ్ళ రాఘవయ్య, పుప్పాల సుబ్బారావు, అడుసు మల్లికి చెందిన పంగులూరి నాగేశ్వరరావు, ముప్పా సత్యనారాయణ, కొత్తపల్లి ప్రసాద్, పర్చూరు పట్టణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొల్లా శివరాం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.

అనుమతులతోనే లే అవుట్లు ఏర్పాటు చేసుకోవాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు లేదా లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ కాకాని రోడ్లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, నందివెలుగు రోడ్ లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్మెంట్ లను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటి ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరి, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసిపి బాబురావు, టిపిబిఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి సూచనలు

విశాలాంధ్ర - తెనాలి : కేంద్రప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ద్వారా విజయవాడ డివిజన్‌లోని తెనాలి రైల్వే స్టేషన్‌ను కూడా ఎంపిక చేసి తెనాలి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని తెనాలి పట్టణాభివృద్ధి సంస్థ వారు ఒక ప్రకటనలో కోరారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు విజ్ఞాపన పత్రం పంపారు. పడమర వైపునున్న రైల్వే బుకింగ్ కౌంటర్‌ను జనరల్ రిజర్వేషన్ టిక్కెట్లపై తిరిగి పునరుద్ధరించాలని కోరారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌ల సౌకర్యార్థం మరికొన్ని వీల్ ఛైర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. 4/5 ఫ్లాట్‌ఫారం వద్ద ఎస్కలేటర్‌ను కౌంటర్ వద్ద, దక్షిణం వైపు కొత్తగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జివద్ద, అన్ని ఫ్లాట్‌ఫారంల వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. 2, 5 ఫ్లాట్‌ఫారంల వద్ద రైలు వచ్చే సమయంలో కోచ్ నెంబర్ తెలిపే డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ఫ్లాట్‌ఫారంల వద్ద ఇరువైపుల రక్షిత తాగునీటిని ఏర్పాటు చేయాలన్నారు. భోజనం, టిఫెన్‌ల కొరకు క్యాంటిన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. పై సౌకర్యములు కల్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తి చేసిన వారిలో సంస్థ అధ్యక్షులు దర్శి శివకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, మాచిరాజు రామకృష్ణమూర్తి, శంకరరావు, కమలకుమార్, సోమయ్యశాస్త్రి, అబ్రహం లింకన్ కోరారు.

మాజీ ఎంపీ రాయపాటి నివాసంలో ఈడీ సోదాలు

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు నివాసంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాడులు నిర్వహించింది. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో గుంటూరులోని రాయపాటి నివాసంలో మంగళ వారం ఉదయం నుంచే సోదాలు జరుపుతోంది. ట్రాన్స్‌ట్రాయ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, బ్యాంకు రుణాల ఎగవేత అంశానికి సంబంధించి విచారణలో భాగంగానే గుంటూరులోని రాయపాటి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొన్నూరు రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లైన్ పగిలి 30 రోజుల నుంచి వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ నీళ్ళు మంచి నీటితో కలుషితమై నందివెలుగు రోడ్డులో ఉన్న మంచి నీరు ప్యూరిఫై అయ్యే ట్యాంక్‌లను శుభ్రపరచకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం అడొద్దని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ఒక ప్రకటనలో అన్నారు. ఏ ప్రాంతంలో చూసిన ప్రజలు టైఫాయిడ్, మలేరియా, జ్వరాలతో చాలా ఇబ్బందిపడుతున్నరని, ఇప్పటికైనా పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఏడుగురు నామినేషన్

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘ(స్టాండింగ్ కమిటీ) ఎన్నికల్లో 7 మంది నామినేషన్లు వేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఈ నెల 11న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. మంగళవారం నామినేషన్ గడువు సమయానికి 7 మంది నామినేషన్లు వేశారని, బుధవారం నామినేషన్ల స్క్రూటీని నిర్వహించి, అర్హత కల్గిన వారి లిస్టును అదేరోజు పబ్లిష్ చేస్తామని తెలిపారు. ఈ నెల 7 వరకు నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవడానికి గడువు ఉందని, అదే రోజు ఫైనల్ లిస్టు పబ్లిష్ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 11న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. స్టాండింగ్ కమిటికి శ్యామల వెంకట రమణాదేవి(26), అడకా పద్మావతి(24), మల్లి బోయిన శ్రీవల్లి(51), సంకూరి శ్రీనివాస రావు(13), పాపతోటి అంబేద్కర్(54), కంద్రగుంట గురవయ్య(21), షేక్ మహమూద్(4)లు నామినేషన్లు వేశారని అన్నారు.

అధ్యాపకురాలు నళినీకి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బోధనా సామర్థ్యాలు-ఉపాధ్యాయుల దృక్పథం అనే అంశంపై చేసిన పరిశోధనకు అధ్యాపకురాలు నేరేడుమల్లి నళినీ కి ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రధానం చేసింది. గుంటూరు నగరానికి చెందిన ఆమె నరసరావుపేట మండలం కేశానుపల్లిలోని డాక్టర్ కేఎస్‌పీఆర్ బీఈడీ కళాశాలలో సాంఘిక శాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఆమె 'టీచింగ్ కాంపిటెన్సీస్ అండ్ టీచర్స్ ఆటిట్యూడ్ - ఏ స్టడీ ఎమాంగ్ ప్రాస్పెక్టివ్ టీచర్స్' అనే అంశంపై తెలంగాణా వర్సిటీ ప్రొఫెసర్ డి.బలరాములు పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

గల్లా అరుణ కుమారి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యులు గల్లా అరుణ కుమారి జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎంపీ గల్లా జయదేవ్ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. గుంటూరు తూర్పు నియజకవర్గ ఇంచార్జీ మహ్మద్ నజీర్, కౌన్సిలర్‌లు, కార్యకర్తల సమక్షంలో పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ గల్లా అరుణ కుమారి నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, మానం పద్మశ్రీ, భారతి, బాలాజీ, వజ్జా లక్ష్మి, విజయలక్ష్మి, అనిత, వాణి, మల్లికా, ఎంపీ కార్యాలయం ఓఎస్‌డీ కరుణచంద్రబాబు, దామోదర్ చౌదరి, షబీర్, మార్కండేయ, జ్యోతుల మురళి, గోళ్ళ ప్రభాకర్, ముత్తినేని రాజేష్, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళంతో వైసీపీ పతనం ఖాయం

- కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: యువగళం పాదయాత్రతో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని, రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) వ్యాఖ్యానించారు. కోవెలమూడీ రవీంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా మంగళవారం పశ్చిమ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున ప్రజానీకంతో తరలి వెళ్లి వినుకొండ నియోజకవర్గం వద్ద లోకేష్‌కి ఘన స్వాగతం పలకటం జరిగింది.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - తెనాలి : గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాని తెనాలిలో వివిధ మహిళాసంఘాలు నిరసన వహించి డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ ముఖ్యకేంద్రాలలో నిరసన వహించి సెంటర్లలో సందర్భాన్ని వివరించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కె.సరళాదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలకు ప్రభుత్వం కట్టుదిట్టం చేయాలన్నారు కార్యక్రమంలో అత్తోట మార్తమ్మ, పినపాటి వజ్రియ, యం.లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఐతానగర్‌లో మేరిమాతా మహిళా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కె.కమలకుమారి, ఎన్.భాగ్యమ్మ, కె.ఎల్.వనజ, ఎన్.రుక్మిణి, అస్మతున్నిసా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సేవలను విస్తృత చేస్తాం

తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీ సేవలను విస్తృత పరుస్తామని, దీనికి అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు శ్యామలానగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్‌సీసీలో ప్రోత్సహించి దేశభక్తి, క్రమశిక్షణ కలిగిన భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాలని అన్నారు. తెలుగు రాష్ట్రాలో 9 యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది దాదాపుగా 1050 స్కూల్స్ నుంచి ఎన్‌సీసీ విభాగాన్ని ఏర్పాటుకు ధరఖాస్తులు అందజేశారని, తద్వారా దాదాపు 60వేల మంది విద్యార్థులకు ఎన్‌సీసీలో అవకాశం దొరుకుతుందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక ఉపాధ్యాయుడు, అలాగే ప్రత్యేక గది కేటాయిం చాలని పేర్కొన్నారు. ఎన్‌సీసీలో చేరకుండా బోగస్ సర్టిఫికెట్లు తీసుకొని ఉద్యోగాలు పొందుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్‌సీసీలో ఉన్న సమస్యలను ఏపీ ప్రభుత్వ సీఎస్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్ఎమ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-గురజాల : పట్టణంలోని శ్రీ పాత పాటమ్మ అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వచ్చు భక్తులకు, వృద్ధులకు, అనాధలకు, యాచకులకు, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గురజాల నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి కుమారుడు మోక్షజ్ఞేశ్వర రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ స్మైల్ ఫౌండేషన్ తరుపున భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు.

ఎల్ఐసీ, పీఎస్‌జీఐ రిటైర్డు ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం పెంచాలి

ఎంపీ గల్లా జయదేవ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎల్ఐసీ, పీఎస్‌జీఐ రిటైర్డు ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ 30శాతంకు పెంచాలని గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఎల్ఐసీ, పీఎస్‌జీఐ కుటుంబ పెన్షనర్లు దాదాపు 3 దశాబ్దాలుగా ఎటువంటి పెంపుదల లేకుండా పదవీ విరమణ సమయంలో ప్రాథమిక వేతనంలో 15శాతం కుటుంబ పెన్షన్ చెల్లిస్తున్నట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఆర్‌బీఐ నాబార్డు, ఆర్ఆర్‌బీలు, పీఎస్‌బీల రిటైర్డ్ ఉద్యోగులకు ఎలాంటి సీలింగ్ లేకుండా కుటుంబ పెన్షన్ 30శాతంకి పెంచబడింది. ఈ రెండు వర్గాల ఉద్యోగుల మధ్య పెన్షన్ విషయంలో ఎలాంటి వివక్ష ఉండకూడదని జయదేవ్ అన్నారు. ఎల్ఐసి బోర్డ్, జనరల్ ఇన్సూరెన్స్ పబ్లిక్ సెక్టార్ అసోసియేషన్ గవర్నింగ్ బాడీ 2019, 2021లో వరుసగా ఎలాంటి సీలింగ్ లేకుండా ఫ్యామిలీ పెన్షన్‌ను 30శాతంకి పెంచాలని సిఫార్సు చేశాయి. కానీ, జీఓఐ నుండి నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉంది. ద్రవ్యోల్బణం పెరుగుదల, జీవన వ్యయాలు విపరీతంగా పెరిగిపోయాయి. కుటుంబ పెన్షనర్లు తక్కువ కుటుంబ పెన్షన్‌ను భరించడం అంత సులభం కాదన్నారు. కావున ఎల్ఐసీ, పీఎస్‌జీఐ రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఎల్ఐసీ, జీఐ పీఎస్ఏ బోర్డులు చేసిన సిఫార్సులను అమలు చేయాలని కోరారు.

ఫిరంగిపురం నూతన ఎస్ఐగా కిషోర్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఫిరంగిపురం మండల నూతన యస్.ఐ.గా చల్లా కిషోర్ బాధ్యతలు చేపట్టారు. కిషోర్ గుంటూరులో ఇంటెలిజెన్స్ యస్.ఐగా పని చేస్తూ బదిలీపై ఫిరంగిపురం యస్.ఐ గా బాధ్యతలు తీసుకున్నారు. లక్ష్మీనారాయణరెడ్డి గుంటూరు వి.ఆర్‌కు బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా నూతన యస్.ఐ మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతలు నెలకొల్పి ఎప్పటికప్పుడు ఫిర్యాదు దారుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని చెప్పారు.

CHANGE OF NAME

I, **NAGESWARA RAO VELIVOLU** (Old Name) S/o. **VELUVOLU VENKATRAO,** R/o. D.No.5-43, Siripuram Village, Medikonduru Mandal, Guntur District - 522401, Andhra Pradesh, have changed my name to **VELUVOLU NAGESWARA RAO.** Hereafter my name is known as **VELUVOLU NAGESWARA RAO.**

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, పాతరెడ్డిపాలెం శివారు కొత్తరెడ్డిపాలెం వాస్తవ్యులు(లేటు) తులం యలమంద గారి భార్య (లేటు) వెంకట సుబ్బమ్మ గార్ల వారసులైన గుండవరం గ్రామ కాపురస్తులు (లేటు) తులం సాంబయ్య గారి కుమారుడు తులం నాగేశ్వరరావు గారి ద్వారా సంజాయిషి పొంది యావసమందికి తెలియ జేయునది ఏమనగా, పాతరెడ్డిపాలెం గ్రామం తాలూకా డి.నెం.238/4రులో 1-32 సెంట్లు మిజువలే 0-52 సెంట్లు శేరి మేరక భూమి మా నాయనమ్మగారైన తులం వెంకట సుబ్బమ్మ గారి పేరున చేబ్రోలు సబ్.రి.287/1961రుగా రిజిష్టర్ కాబడినది. వారి వారసులమైన సదరు ఆస్తి మాకు చెందియున్నది. ఈ ఆస్తిని మేము 1బి, అడంగల్, పాస్ పుస్తకములు పొందుటకు తాహశీల్దార్ వారికి అర్జీ పెట్టియున్నము. దినిపై ఎవ్వరికైన అభ్యంతరములు ఉన్నచో 15 రోజుల్లో ఈ క్రింది ఫోన్ నెంబర్లకు తెలియపరచగలరు.

తాడిబోయిన శ్రీనివాసరావు,
అడ్వకేట్ అండ్ నోటరి చేబ్రోలు
సెల్ : 9985037928, 8008285048

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

నకిలీ విత్తనాల బారి నుంచి పల్నాడు జిల్లా రైతులను కాపాడండి

విశాలాంధ్ర-బొల్లాపల్లి : పల్నాడు జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతున్నాయని వాటిపై వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకొని సంబంధిత వ్యక్తుల్ని కఠినంగా శిక్షించి రైతులని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నకిలీల విషయంలో అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారన్నారు. వెల్లటూరు గ్రామ రైతు కంచర్ల శ్రీనివాసరావుకు నకిలీ విత్తనాలు దుకాణాదారులపై అధికారులు చర్యలు చేపట్టి రైతుకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని, అధికారుల్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యోహాన్, దశరథ్, కంచర్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రామారావు, బాలు, సింహాచలం తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేత షరీఫ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : వైసీపీ మండల కన్వీనర్ షరీఫ్ జన్మదిన వేడుకలు మండల పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈద సాంబిరెడ్డి, ఎంపీపీ మీరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకుడు కంకణాల శివాజీ, సచివాలయ కన్వీనర్ అనిల్ బచ్చు హనుమంతరావు, చిన్న మక్కెన, నాయకులు బాజీ, వైస్ ఎంపీపీ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి లోకేష్‌కు ఎన్నారై మాగులూరి చేయూత

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయి.. అత్తా, మామల సంరక్షణలో ఉంటూ స్కూల్ మానివేసిన విద్యార్థి లోకేష్‌తో మాట్లాడి, తిరిగి పదవ తరగతి(స్థానిక కాకతీయ స్కూల్‌లో) కొనసాగించటానికి ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ చేయూత ఇస్తున్నట్లు ప్రముఖ న్యాయవాది మాగులూరి హరిబాబు తెలిపారు. ముఖ్యంగా వేలకు వేలు ఫీజులు కట్టలేక.. గ్రామీణ రైతు, పేద కుటుంబాల విద్యార్థుల విద్యాభ్యాసం కడు కష్టతరంగా మారిన ఈ రోజుల్లో, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి.. చదువు పూర్తిగా మానేసిన లోకేష్ పరిస్థితి, స్థానికుడు సురేష్ ద్వారా తెలుసుకొని, మాట్లాడి స్కూల్లో యాజమాన్యంతో మాట్లాడి మొదటి విడత ఫీజు చెల్లించిన ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో ఫీజు అందించినట్లు వారి సోదరుడు, హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ వైస్ చైర్మన్ మాగులూరి కృష్ణారావు, నిర్వాహకులు కుంచనపల్లి కిరణ్ కుమార్, సురేష్, కాకతీయ విద్యాసంస్థల కరస్పాడెంట్ లలిత బాబు, ఇందిరా దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-ఈపూరు : ప్రతి రైతు ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామారావు ఒక ప్రకటనలో అన్నారు. ప్రతి ఒక్క రైతు కూడా వారి పొలం ఉన్నటువంటి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని, ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ నెల 7వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ప్రతిఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం అందజేసే రూ.2 వేల చొప్పున ఏటా రూ.6 వేలు జమ కావాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో కౌలు రైతు కార్డులు 2060 మందికి గాను ఇప్పటివరకు 1280 మందికి పంపిణీ చేశామని, ఇంకా 774 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 1337 మంది ఈ కేవైసీ చేయించాల్సి ఉండగా 1285 మంది చేయించారని మిగిలిన వారు కూడా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే యజమాని చనిపోయిన స్థానంలో వారి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే ఈ-కేవైసీ చేయించుకున్నట్లయితే పీఎం కిసాన్ రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

మంగళగిరి విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగరంలోని షరాఫ్ బజార్ శ్రీ చైతన్య టెక్నో విద్యార్థులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ప్రతిభావంతులను వెలికితీసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నాసా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్-2023 ప్రోగ్రాంలో శ్రీ చైతన్య పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ఆరుష్, రాజు, పార్థశ్రీవల్లి, యాస్మిన్, అక్షయ కృష్ణ, భానుశ్రీ సమర్పించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుక్కమళ్ల వాసు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ విజయం ఒక్క పాఠశాలదే కాదని మంగళగిరి ప్రాంతం మొత్తానికి చెందుతుందని అన్నారు. ప్రాజెక్టు విజయం వెనుక కృషిచేసిన అధ్యాపకులకు, విద్యార్థులకు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులకు షీల్డ్‌లు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ హబీబ్, కోఆర్డినేటర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న సురక్ష లక్ష్యం పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష పథకం ద్వారా జరిపిన సర్వే కార్యక్రమం ద్వారా 97 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళ వారం మీడియాతో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఉన్న 538 సచివాలయాల ద్వారా 10,770 మంది వాలంటీర్లు జూన్ 24 నుంచి జూలై 31 వరకు సర్వే కార్యక్రమం పూర్తి చేయించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జగనన్న సురక్ష పథకం ద్వారా 1,54,033 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1,43,755 దరఖాస్తులు పరిశీలన చేసి,1,39,498 ధృవీకరణ పత్రాలను మంజూరు చేశామన్నారు. మిగిలిన 4,970 దరఖాస్తులు ఆధార్ కార్డుల పేర్లు తప్పులు, ఫోన్ నంబర్ల తప్పులు, పుట్టిన తేదీ, మరణ తేదీ ధృవీకరణ పత్రాలు తదితర అంశాలకు సంబంధించినవి పెండింగ్ లో ఉన్నాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారిణి మహా లక్ష్మీ, కలెక్టరేట్ ఏ.ఓ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న క్విట్ ఇండియా స్ఫూర్తితో సేవ్ ఇండియా

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న క్విట్ ఇండియా, సేవ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కన్వీనర్ కాసా రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ, రైతు సంఘ, సీపీఐ, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించాలని, నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని కార్మికవర్గం సమర శంఖారావం పూరించిందని, కార్మికవర్గం, రైతాంగంతో కలిసి మోదీ కార్పొరేట్ అనుకూల విధానాలపై దేశ వ్యాపిత ఉద్యమానికి పిలుపునిచ్చిందన్నారు. రైతు, కార్మిక, ఉద్యోగ, సాధారణ ప్రజలకు వ్యతిరేకంగా ధనిక, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ ఆపాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన బైకు ర్యాలీలు నిర్వహించాలని, 8వ తేదీ మానవ హారాలు, 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సేవ్ ఇండియా దినంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, ఏపీ మహిళా సంఘం ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసా సాంబయ్య, ఏరియా అధ్యక్షుడు తూబాటి సుభాని పాల్గొన్నారు.

పాత సదుపాయాలను పునరుద్ధరించండి

ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు

విశాలాంధ్ర-గుంటూరు : ఆర్టీసీ ఉద్యోగులు పీటీడీ ఉద్యోగులుగా మారిన తరువాత రద్దు చేయబడిన ఆర్టీసీ పాత సదుపాయాలను పునరుద్దరించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు డిమాండ్ చేశారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ గుంటూరు జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కరీముల్లా అధ్యక్షతన గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర రావు, జీవీ నరసయ్యలు హాజరయ్యారు. దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనంకు ముందు ఉన్నటువంటి ఆర్టీసి రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్ ప్రకారమే పీటీడీ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ సాధన కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఏపీజేఏసీ అమరావతి సంఘముతో కలిసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీటీడీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న లీవ్, ఎన్ క్యాష్‌మెంట్‌ను సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకరించిందని తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంగ్త్ ద్వారా ఉత్పన్నమైన సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్య పరిష్కారము కోసం ఈయూ కృషి చేస్తుందని చెప్పారు. ఉద్యోగులలో ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన భాధ్యత యాజమాన్యంపై ఉందని అన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.నారాయణ రావు మాట్లాడుతూ జీఓ నెం.70, 71 ద్వారా కాండక్ట్, సీసీఏ నిబంధనలలో ఉన్న విషయాలను ఉద్యోగులకు తెలియజేశారు. ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకరరావు, కార్యదర్శి ఎన్‌వీ కృష్ణారావు, నెల్లూరు జోనల్ కార్యదర్శి డి.బాబు శామ్యూల్, జిల్లా కార్యదర్శి ఇ.విజయకుమార్‌లు ప్రసంగించగా గుంటూరు జిల్లాలోని డిపో కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయవాది విటల్ బాబు హత్య అమానుషం

విశాలాంధ్ర - వినుకొండ : విజయవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది ఆర్ ఆదిశేషు విటల్ బాబును కిరాతకంగా, పాసవికంగా, అసాంఘిక శక్తులు హత్య చేయటాన్ని వినుకొండ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ హత్యకు నిరసనగా మరియు న్యాయవాది విటల్ బాబు మృతికి సంతాపంగా మంగళవారం వినుకొండ బార్ అసోసియేషన్ బిల్డింగ్ నందు న్యాయవాదుల ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులకు గైర్హాజరయ్యారు. చట్టాలను మరింత బలోపేతం చేయాలని వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాంజనేయ చౌదరి కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పీజే లూక, సిహెచ్.వెంకట రెడ్డి, టి.హనుమంతరావు, ఎలీషా బాబు, బి శ్రీనివాసులు, జెట్టి తిరుపతిరావు, మీసాల శ్రీనివాసులు, రమణారావు, అప్పారావు,తలారి ఆంజనేయులు, అశోక్ బాబు, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు సీతారామాంజనేయులు, సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి నాగేశ్వరరావు,గంధం హరిప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర - వినుకొండ : ఇండియన్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ మరియు గర్భిణీ స్త్రీలకు హైజెనిక్ కిట్స్ పంపిణీ, ప్రజలకు సహాయం చేయుటలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడు ముందంజలో ఉంటుంది. నగరంలోని పదిమంది గర్భిణీ స్త్రీలకు నిత్య అవసరాలైన హై జెనిక్ కిట్స్ ఇవ్వడం జరిగింది. అలానే భవనాసి. నక్షత్రం, అనే వృద్ధ వికలాంగురాలైన మహిళకు సైకిలను పంపిణీ చేయడం జరిగింది. అలానే అర్హులైన వికలాంగులకు ఒక ట్రై సైకిల్ అందుబాటులో ఉంది అని సొసైటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బెల్లంకొండ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పొత్తూరి రాము, గర్రె అనిల్, గజవల్లి. పవన్, చిలంకూరి. కోటేశ్వరరావు, చిన్ని, బరామ్మూర్తి, గుంటకల. వీర అంకమరావు, పేరూరి. కృష్ణ, కజ్జాయం. విజయలక్ష్మి, జవ్వాజి. సువర్ణ లక్ష్మి, శారద, మేఘమాల, గుడిపాటి. లక్ష్మీరాజ్యం, బి బి టి. ఉష, ఠాగూర్ ,మొదలైన వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ట్రై సైకిల్ అవసరమైన ఒకరికి అందుబాటులో ఉన్నది సెల్ నెంబర్ 9291506317కు సంప్రదించగలరు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - వినుకొండ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం వినుకొండ నియోజకవర్గంలో ప్రవేశించింది. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి వారి కుటుంబ సభ్యులు.. నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు.

ఎల్ఐసీలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

విశాలాంధ్ర - వినుకొండ : వినకొండ ఎల్ఐసి ఆవరణలో మంగళవారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏ.ఐ.ఐ.ఈ.ఏ), ఎల్ఐసి క్లాస్ 1 ఆఫీసర్స్ సంయుక్తంగా ఫ్యామిలీ పెన్షన్ స్కీమును 15% నుండి 30% వరకు తక్షణం అమలు చేయాలని సత్వరంగా వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని యన్.యస్.పికు మేనేజ్మెంట్ కాంట్రిబ్యూషన్ టెన్ పర్సెంట్ నుండి 14% కు పెంచాలని ఎల్ఐసి లో ఉద్యోగుల రిక్రూట్మెంట్లు వెంటనే చేయాలన్నారు. ఈ మీటింగ్‌లో ఐ.సి.ఈ.యు సెక్రటరీ కామ్రేడ్ సిహెచ్. గోపాలకృష్ణ కుమార్, ఎల్ఐసి ఉద్యోగుల గురించి ఉద్దేశించి మాట్లాడారు. ఇంకా ఈ మీటింగ్ లో బ్రాంచ్ మేనేజర్ బి.లక్ష్మీ నాయక్, రామారావు, వెంకటేష్, కుమారి అమృతవల్లి, నాగబాబు, వై. రాము పవన్, శేషావలి, సాయికిరణ్, అంకమ్మరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏపీలో విద్యుత్ సమస్యలపై 5న రాష్ట్ర స్థాయి సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5న శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ హనుమాన్ పేటలోని దాసరి భవన్‌లో 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు-ప్రజలపై భారాలు'అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్‌తో పాటు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నేతలు, విద్యుత్ రంగ నిపుణులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గల్లా అరుణ కుమారి పుట్టిన రోజు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ మాతృమూర్తి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి పుట్టిన రోజు వేడుకలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) శుభాకాంక్షలు తెలిపి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరావు, కసుకుర్తి హనుమంతరావు పాల్గొన్నారు.

7న రైతుల ధర్నాను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానం ఇంతవరకు అమలుకు నోచుకోలేదని, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న విజయవాడలో జరిగే రైతు ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో రైతుల ధర్నా చలో విజయవాడ పోస్టర్లను సీపీఐ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సాగు ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయని, కౌలు రైతులు కూడా వ్యవసాయం చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో రైతులు, కౌలు రైతులందరిని ఆదుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరహాలో మన రాష్ట్రంలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.10 వేలు సాగుసాయం అందించాలని డిమాండ్ చేశారు. సన్నకారు రైతులు, కౌలు రైతులు అత్యధికులు రుణభారం అధికమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు నివారించడానికి 2 ఎకరాల వరకు సాగుచేస్తున్న ప్రతి రైతుకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, రెండు ఎకరాలకు పైబడిన వారందరికి ప్రతి ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందించాలని, డాక్టర్ స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘం ఏరియా అధ్యక్షుడు చంద్ర కొండలరావు, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్షాధికారి, నాయకులు పేలూరి రామారావు, కొండ్రగుంట వెంకటేశ్వర్లు, బొంతా శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిపింగ్ పోటీల్లో సత్తా చాటిన 'గీతాంజలి'

విశాలాంధ్ర-తాడేపల్లి : జులై 29, 30 తేదీలలో కర్నూలు జిల్లా గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిపింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లి గీతాంజలి స్కూలుకి చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటారని పాఠశాల కరస్పాండెట్ రమాదేవి మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రోప్ స్కిపింగ్ జిల్లా కార్యదర్శి శివకృష్ణ ఇతర వ్యాయామ ఉపాధ్యాయులైన షాహిన్, పవన్‌ల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించబడ్డాయని అన్నారు. స్పీడ్ ఆఫ్ విభాగం అండర్ 17 బాలుర విభాగంలో పి.పవన్ గోల్డు మెడల్, టి.శ్రీవర్ధన్ సిల్వర్ మెడల్, కె.మేఘవర్ధన్ బ్రాంజ్ మెడల్ అండర్ 14 విభాగంలో బాలురు ఎ.పురంధర్ గోల్డుమెడల్, విఘ్నేష్ బ్రాంజ్ మెడల్ అండర్ 14 బాలికల విభాగంలో యం.పూజిత గోల్డుమెడల్, జి.సావిత్రి బ్రాంజ్ మెడల్ అండర్ 'ఏ' బాలుర విభాగంలో పి.హేమ శివశంకర్ గోల్డ్ మెడల్, జి.జితేంద్ర సిల్వర్ మెడల్, బి.ప్రజ్వల్, బ్రాంజ్ మెడల్ అండర్ 8 బాలికల విభాగంలో అన్విత గోల్డు మోడల్‌ను సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ రమాదేవి అభినందించారు.

వక్ఫ్ భూములకు రక్షణ ఏదీ?

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ, బడేపురం గ్రామాలలో ఉన్న వక్ఫ్ భూములకు రక్షణ లేకుండా పోయింది. 2014లో రాజధాని పుణ్యమా అంటూ భూములకు రెక్కలు వచ్చాయి. అక్రమార్కుల కన్ను ఖాళీ భూములపై పడింది. అక్రమార్కులకు ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు సహకారం అందించడంతో భూములను కొట్టేస్తున్నారు. బడేపురం గ్రామంలోని సర్వే నెంబర్ 1476లో 65 సెంట్లు సర్వే నెంబర్ 1486లో పది ఎకరాల 63 సెంట్లు మెట్ట భూమి ఉంది. కొందరు ప్రబుద్ధులు ఈ భూమిని కాజేసేందుకు రంగం సిద్ధం చేశారు. వక్ఫ్ బోర్డు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఈ భూములను కాజేసేందుకు మంగళగిరికి చెందిన కొందరు ప్రబుద్ధులు రంగంలోకి దిగారు. వేసవి కాలంలో ప్రొక్లెయిన్‌తో భూములను చదును చేశారు. గ్రామస్తులు ప్రశ్నించడంతో విరమించుకున్నారు. అలాగే తాడికొండ బస్టాండుకు సమీపంలో 80 గజాల పీర్ల చావిడి ఉంది. రెవెన్యూ పంచాయతీ విద్యుత్ అధికారులు అనుమతులు ఇవ్వటంతో ఏకంగా కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఇంత జరుగుతున్న అటు ప్రజాప్రతినిధులు జిల్లాస్థాయి అధికారులు స్పందించడం లేదు. గత కొద్ది రోజుల క్రితం టీడీపీకి చెందిన కొందరు యువకులు వక్ఫ్ భూములను కాపాడాలని సమావేశాన్ని నిర్వహించారు. వక్ఫ్ భూములను కాపాడుకుంటే కలెక్టర్ కార్యాలయం తాహశీల్దార్ కార్యాలయం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అయినా అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం. ఈ విషయమై వక్ఫ్ బోర్డ్ అధికారి ముక్తార్‌ను విశాలాంధ్ర వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే భూములకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బోర్డు ఏర్పాటు

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని అడిగొప్పల గ్రామ పంచాయతీ ఆదర్శ పాఠశాల ఎదురు బజారులో మంగళవారం పంచాయతీ కార్యదర్శి హఫీజుద్దీన్ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బోర్డ్ ఏర్పాటు చేశారు. ఈ బోర్డ్ నందు త్రాగునీరు, చేతులు పరిశుభ్రత, మరుగుదొడ్లు, తడిచెత్త,పొడిచెత్త,ఇంకుడు గుంతలు చూపించే చిత్రాలుతో కూడిన బోర్డును నెలకొల్పారు.గ్రామస్తులు ఈబోర్డులో ఉన్న అంశాలను పాటించి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు తోడ్పడాలని సెక్రటరీ హఫీజుద్దీన్ కోరారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చల్లా వెంకమ్మశ్రీనివాసరావు ఉన్నారు.

సినిమా వినోదంపై ఉన్న శ్రద్ధ న్యాయవాదుల భద్రతపై లేకపోవడం బాధాకరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పాలకులకు సినిమా వినోదంపై ఉన్న శ్రద్ధ న్యాయవాదుల భద్రతపై లేకపోవడం బాధాకరమని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్(ఆలా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయవాదులుపై దాడులు, హత్యలు జరుగుతున్నా న్యాయవాదుల రక్షణ చట్టంపై కేంద్ర ప్రభుత్వానికి శ్రద్ధ లేదని, సినిమా పైరసి చేసే వాళ్ళను నియంత్రించటం కోసం మాత్రం తక్షణమే పార్లమెంట్‌లో ప్రత్యేక బిల్లు ఆమోదింపచేశారన్నారు. న్యాయవాదుల ప్రాణాలు, రక్షణ కన్నా సినిమా వినోదమే ప్రధానం అని కేంద్ర ప్రభుత్వం బావించడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయవాద సంఘాలు, న్యాయవాదుల భద్రతకై చిత్తశుద్ధితో ప్రణాళిక కనపరచకపోతే న్యాయవాదులుపై హత్యలు, దాడులు జరుగుతూనే ఉంటాయన్నారు

సాగుదారులు కౌలు కార్డులు పొందాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: రైతుల పొలాలను కౌలుకు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన రైతులందరూ సాగుదారు గుర్తింపు పత్రాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1640మందికి కౌలు రైతు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించగా ఇప్పటివరకు 1107 మందికి కార్డులు మంజూరు చేశామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలలో ఇంకెవరైనా ఉంటే కార్డులకు దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 7వ తారీఖు వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని కౌలు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలతోపాటు పరిహారం అందాలంటే కౌలు కార్డులు తప్పనిసరి అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా భూ యజమానులు సహకరించాలని కోరారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె. వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాఠశాలలో 9,10వ తరగతి గదులను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా బోధించే తీరును పరిశీలించారు. పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కింద యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బెల్ట్, షూ, సాక్సులు, బ్యాగులు, డిక్షనరీలు అందినాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. పాఠ్యప్రణాళిక, డైరీలను పరిశీలించారు. అదే విధంగా పదవతరగతి విద్యార్థుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియ్యం సుభానీ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-మాచర్ల: విధి నిర్వహణలో గాయపడిన కార్మికుడు తురకా సతీష్‌కు పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాజుల చెన్నయ్య ఆర్థిక సాయం అందజేశారు.

గాజుల చెన్నయ్య మాట్లాడుతూ కార్మికులంతా సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి నెల మొదటి రోజున నిర్వహించే కార్మికుల సమావేశానికి కార్మికులంతా విధిగా హాజరు కావాలన్నారు. యూనియన్ లో సభ్యత్వం ఉన్న కార్మికులకు మాత్రమే యూనియన్ అందించే ప్రత్యేక ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు. యూనియన్ నిబంధనలను అతిక్రమించి 1 వ తేదీ నాడు పనులకు వెళ్లిన కార్మికులపై రూ.2వేలు అపరాధ రుసుమును వసూలు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం గాయపడిన సతీష్ కు రూ.3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో షేక్ మౌలాలి, చల్లా నాగేశ్వరరావు, గొట్టిముక్కల రామదాసు, బత్తిన శ్రీను, మక్కెన శ్రీను, అప్పారావు, ఎస్ ఎండి భాషా, పగడాల సుధాకర్, షేక్ రంజాన్ ఉప్పుతోళ్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-శావల్యాపురం : తల్లిపాలతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతారని వైద్యాధికారి వేమూరి వెంకట బాస్కర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు తల్లిపాల ప్రాముఖ్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు, ఈ నెల 7వ తేది నుంచి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లలు పుట్టిన వెంటనే తల్లిపాలను అందించాలని, బిడ్డలకు పాలు ఇచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ రాదని తెలిపారు. నెలలోపు శిశు మరణాలు జరగడానికి కారణమయ్యే శ్వాసకోశ వ్యాధులు, కామెర్లు, డయేరియా వంటి రోగాలను ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తి తల్లి పాలలోనే నవజాత శిశువుకు లభిస్తుందన్నారు. మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో బాగంగా ప్రతిఒక్క చిన్నారిని గుర్తించి వారికి వాక్సిన్ వేయనున్నామని అన్నారు. సీహెచ్ఓ వెంకటయ్య, సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఉమాదేవి, సాయిగీతా, డీపీఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు 20 తోపుడు బండ్లు

విశాలాంధ్ర-గురజాల : నగర పంచాయతీ పరిధిలోని ప్రతి వీధిలో చెత్త సేకరించేందుకు కొత్తగా మరో 20 తోపుడు బండ్లు కేటాయించినట్లు మున్సిపల్ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి తెలిపారు.

మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాల యంలో తోపుడు బండ్లను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. చెత్త సేకరణ మరింత సులువుగా ఉండేందుకు నగర పంచాయతీ పరిధిలోని ప్రతి 250 ఇళ్లకు నూతనంగా 20 తోపుడు బండ్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఉదయం చెత్త సేకరణ అనంతరం మధ్యాహ్న సమయంలో శానిటేషన్ కార్యక్రమానికి కూడా ఈ తోపుడు బండ్లను ఉపయోగించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పవన్మయి వీరారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్ రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు షేక్ బడేజాని, మన్యం కన్యాకుమారి ప్రసాదరావు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ సైదా రెడ్డి, నాసర్ సైదా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు గుంటూరు డిప్యూటీ మేయర్ స్వాగతం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హజ్ యాత్రను విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న హజ్ యాత్రికులకు గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్.సజీల హజ్ కమిటీ చైర్మన్ గౌస్ ఆజాంతో కలిసి మంగళవారం స్వాగతం పలికారు.

హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో వైసీపీ నాయకులు షేక్ షౌకత్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మత పెద్దలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఉద్యమంగా మారాలి

- రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని ఆయా గ్రామాల్లోని మండల సమైక్య, గ్రామ సమాఖ్య, మహిళా సంఘాల ద్వారా రైతులందరినీ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లే విధంగా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్క సిబ్బందిపై ఉందని ఆయన అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలనాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. అమల కుమారి మాట్లాడుతూ ప్రస్తుత కాల పరిస్థితుల ప్రకారం రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన ఆవు పేడ, మూత్రం, పలు రకాల ఆకులతో తయారు చేసినటువంటి నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, కషాయాలను పంటలపై పిచికారి చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించటమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. మూడు సెంట్లు భూమిలో సూర్య మండలం విధానంలో దుంప, తీగజాతి, ఆకు కూరలు, పండ్లు మొక్కలను నాటి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకుని ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించటమే కాకుండా నెలసరి 2000 రూపాయల ఆదాయం కూడా పొందవచ్చు అని ఆమె తెలిపారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

మానవ అక్రమ రవాణాను అరికడదాం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మానవ అక్రమ రవాణాను అరికడదామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శివ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా బాపట్ల ఏబీఎమ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శివ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో మానవ అక్రమ రవాణా అనేది చాలా నేరమని అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఒకరి శ్రమను దోపిడీ చేసే అధికారం ఇంకొకరికి లేదని సమాజంలో ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ లక్ష్మీ పద్మావతి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు నారాయణ భట్టు, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిన రవి ప్రదీప్, గుదే రాజారావు, విజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిఫార్డు సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ , నాగరాజు, బడుగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఉమ్మడి పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో జరుగుతుంది. ఈ నేపథ్యంలో బాపట్ల టీడీపీ ఇంచార్జ్ వేగేశన నరేంద్రవర్మ యువగళం పాదయాత్రలో పాల్గొన్నారు. పల్నాడు టీడీపీ అధ్యక్షులు వినుకొండ నియోజకవర్గ ఇంచార్జ్ జీవి ఆంజనేయులు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, మాచర్ల ఇంచార్జ్ జూలగంటి బ్రహ్మారెడ్డి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తదితరులో కాసేపు ముచ్చటించి లోకేష్‌తో కలిసి ఉత్సాహంగా పాదయాత్రలో పర్యటించారు.

మహిళలకు అండగా టీడీపీ మహాశక్తి

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాలతో నియోజకవర్గ మహిళ నాయకుల ఆధ్వర్యంలో బాపట్ల పట్టణ, 11వార్డులో మహాశక్తి టీం ఇంటింటికి పర్యటించి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇటీవల జరిగిన పార్టీ పండుగ మహానాడులో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మనిఫెస్టోలో మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి పథకం అవగాహన కల్గించారు. పార్టీ అధికారంలోకి రాగానే మహిళామణులకు పెద్దపీట వేస్తూ ఆడబిడ్డ నిధి ద్వారా అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ. 15 వేలు దీపం పథకం ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ లు, తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు, జిల్లా వ్యాప్తంగా ఉచిత బస్ ప్రయాణం తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తారని వివరించారు. ప్రతి మహిళా తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, యూనిట్ ఇంచార్జ్ సూరగాని శేఖర్,మన్నెం వెంకటస్వామి,ఉప్పాల శ్రీను,మన్నెం చెంద్రమౌళి, తెలుగు మహిళా నాయకులు పల్లం సరోజిని, చెన్నుపాటి హైమావతి,వేమవరపు సుజాత,జాన్సీరాణి, దగ్గుమల్లి రాణి,రజిని, పద్మ, రమాదేవి, నజ్మ,తాతా జయమ్మ,బడుగు గోపమ్మ, కర్రి యోగేశ్వరి,పద్మ 11వార్డు మహిళలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలను ఖండించిన జేసీఎన్ఎం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులు క్రైస్తవ వర్గాలపై జరుగుతున్న దాడులు హత్యలు మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టి రాజ్యాంగ హక్కులను మానవ హక్కులను పరిరక్షించాలని బాపట్ల పట్టణంలో జె.సి.ఎన్.ఎమ్ సర్వీస్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కన్నెగంటి జాన్ వెస్లీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బిజెపి నిరంకుశ వైఖరిని ముక్తకంఠంతో ఖండించాలని కోరుతూ పాత బస్టాండ్ సెంటర్‌లో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. విద్యుత్ జె.ఈ సహదేవుడు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటన మరణించిన వారి ఆత్మ శాంతి కలగాలని అక్కడ పరిస్థితులు శాంతియుతంగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదే రాజారావు, మార్పు పెద్దరంజాన్, బీఎస్పీ నాయకులు కాగిత కోటేశ్వరరావు, దాసరి లక్ష్మి, కొచ్చర్ల వినయ్,శీలం రోజన్ బాబు, పత్రే కోటయ్య, పౌలు రాజు, మేకల శ్రీరాములు, ఏపూరి జోసఫ్, జొన్నకోటి గాంధీ, పొంగులూరు ప్రసాద్, కర్లపాలెం ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నరాలశెట్టి జన్మదిన వేడుక

- పలువురు ప్రముఖులు హాజరు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వైఎస్సార్ సీపీ బాపట్ల పట్టణ మాజీ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాశ్‌రావు జన్మదిన వేడుక పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా జరిగింది. శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ పలువురు ప్రముఖులు హజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా పలువురు ప్రకాశ్‌కు అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ కౌన్సిలర్ పేర్లీ సునీల్‌కుమార్, బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బోడ్డుకూరి ధనరాజు, సభ్యులు ఉన్నారు.

జీజీహెచ్‌లో మాతా శిశు సంరక్షణ కేంద్రం పనులు వేగవంతం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్ర పనులు శరవేగంగా జరుగుతున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు (జింకానా)కార్యదర్శి 1983 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ దామినేని పట్టాభి రామన్ మంగళవారం ఎంసీహెచ్ బ్లాక్ డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈఎంసీహెచ్ బ్లాక్ రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తుందని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఇప్పటివరకు తల్లి పిల్లల వార్డు ఇరుకైనా గదుల్లో సేవలు అందిస్తున్నారని, జింకనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణం వంద కోట్లతో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రెండు ఫ్లోర్లు పూర్తి కావస్తున్నాయని, మరో నాలుగు ఫ్లోర్లు త్వరలోనే పూర్తి కానున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామన్నారు.

ఎమ్మెల్యే రఘుపతే టార్గెట్..

- ఏకమవుతున్న పలువురు నేతలు
- స్వపక్షంలోనే విపక్షంలా బాపట్ల రాజకీయాలు
- ప్రజాబలమే కొండంత బలం అంటున్న రఘుపతి
- టికెట్ నాదే..గెలుపు నాదేనంటూ కోన ధీమా

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతే లక్ష్యంగా స్థానిక రాజకీయాలు మారుతున్నాయి. రోజురోజుకు అధికార పార్టీ నేతలు స్వపక్షంలో విపక్షంలా కోనకు వ్యతిరేఖంగా గళం విప్పుతున్నారు. అదిష్టానం సమిష్టిగా పనిచేయాలని సూచిస్తుంటే బాపట్లలో మాత్రం పార్టీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరలా తయారైంది. బాపట్లలో వైసీపీకి కార్యకర్తలో బలమైన క్రేజ్ ఉన్నప్పటికి నాయకుల్లో ఉన్న సమన్వయ లోపం అదిష్టానాన్ని కలవరపెడుతుంది. వైసీపీ నాయకులు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే అనే రీతిలో పార్టీ పేరుతో పలు కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. గత నాలుగేళ్లలో నేతలందరూ కలిసి ఐక్యంగా ఒక్క పార్టీ కార్యక్రమంలో కూడా పాల్గొనకపోవటం గమనార్హం.

- గత నాలుగేళ్లగా బాపట్లలో జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు మధుసూధన్‌రెడ్డి కొందరు నేతలను వెంట పెట్టుకుని నియోజకవర్గంలో విస్తృతంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన స్వంత సామాజిక వర్గం నేతలతో టచ్‌లో ఉంటూ వైసీపీలో ఒక గ్రూప్‌ను ప్రోత్సహిస్తున్నారు. కోన రఘుపతిపై అసంతృప్తితో ఉన్న నేతలందరూ ఉమ్మారెడ్డి వర్గంలో చేరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి సైతం ఓ వర్గాన్ని ఏర్పరచుకుని అంతర్గతంగా రాజకీయాలు నడిపిస్తున్నారు. గత ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ మోదుగుల బసవపున్నారెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకపోయినప్పటికి అంతర్గతంగా రెడ్డి సామాజిక వర్గం నేతలతో టచ్‌లో ఉంటూ తన గ్రూపును కొనసాగిస్తున్నారు. ప్రముఖ న్యాయవాది వైసీపీ సీనియర్ నాయకుడు కళ్ళం హరినాథ్‌రెడ్డి ఫౌండేషన్ పేరుతో విస్తృతంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ తనకు పార్టీపై ఉన్న మక్కువను చాటుకుంటున్నారు. పోలీస్ శాఖలో పనిచేసిన కోట రహీంరెడ్డి కొంతమంది అనుచరులతో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

- గోరుచుట్టుపై రోకటి పోటు

బాపట్ల ఎమ్మెల్యే రఘుపతికి గోరుచుట్టుపై రోకటి పోటులా కర్లపాలెంలో మండలంలోని జడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ యారం వనజ, నల్లమోతువారి పాలెం ఎంపీటీసీ సాంబశివరావుతో పాటు ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిరి రాజశేఖర్‌బాబు తయారైయ్యారు. ఈ పరిస్థితులన్నీ గమనిస్తుంటే రఘుపతి స్థితి స్వపక్షంలో విపక్షంలా తయారైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

- ఎంతమంది ఏకమైన డోంట్‌కేర్

పజలంతా నా వెనుకే ఉన్నారు..గత 20 ఏళ్లుగా బాపట్లలో కోన రఘుపతి ఎన్ని సేవా కార్యక్రమాలు చేశారో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదంటూ ఎమ్మెల్యే రఘుపతి పలు సంధర్భాల్లో ప్రస్తావిస్తున్నారు. ఇటు ప్రజా బలం అటు అధినేత సీఎం జగన్ అశీస్సులు మెండుగా ఉండటంతో ఎలాంటా విపత్కర పరిస్థితులనైన లెక్కచేయకుండా ధీమాతో ముందుకు వెళుతున్నారు. ఎంతమంది రఘుపతి టికెట్ రాదంటూ ఎంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నప్పటికీ కోన మైండ్ గేమ్‌తో ఎప్పటికప్పుడూ వారికి చెక్‌పెడుతూనే ఉన్నారు. 2024 ఎన్నికల్లో టికెట్ నాదే..గెలిచేది నేనే బాపట్ల గడ్డ కోన అడ్డా అంటూ గర్జిస్తున్నారు.

వైసీపీలోనే బీసీ వర్గాలకు గౌరవం

- మీడియాతో ఎంపీ మోపిదేవి

విశాలాంధ్ర - రేపల్లె : బీసీ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశేష కృషి చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసిలకు సంబంధించిన పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఇటీవల టీడీపీ నాయకులు యువగళం పాదయాత్రలో భాగంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన బీసీ సామాజికవర్గల బహిరంగ సభలో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చెయ్యటాన్ని ఖండించారు. నియోజకవర్గంలోని ఉప్పాలపాలెంలో దారుణ హత్యకు గురైన చిన్నారి అమర్నాధ్ గౌడ్ కుటుంభ సభ్యులతో ప్రభుత్వం సత్వర సాయం అందించినప్పటికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించటం దుర్మార్గమని అన్నారు. టీడీపీ, లోకేష్ పాదయాత్రలలో పెయిడ్ ఆర్టిస్టులతో కార్యక్రమలు చేస్తున్నారని అంటే బీసీలను పెయిడ్ ఆర్టిస్టులని అన్నట్లు సృష్టించి గుంటూరు, విజయవాడ పట్టణాలలో ఆందోళనలు నిర్వహించటం సిగ్గుచేటన్నారు. బీసీలకు నేను క్షమాపణలు చెప్పాలని టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర చేసిన వ్యాఖ్యలు పట్ల స్పందించారు. ప్రస్తుతం టీడీపీ శ్రేణులు ఫ్రస్ట్రేషన్ లో బ్రహ్మానందం కామెడీ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. టీడీపీ నేతలు పెయిడ్ ఆర్టిస్ట్‌ల మాదిరి వ్యవహరిస్తున్నారనేది వాస్తవమని అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సభలో పింఛన్ తీసుకుంటున్న మహిళ చేత ఫించన్ రావటం లేదని చెప్పించటం పెయిడ్ ఆర్టిస్టుల ఫేక్ పనులు కాదా అని ప్రశ్నించారు. రాజకీయ వేదికల మీదికి సినిమా ఇండస్ట్రీలో ఉన్న యాంకరుని తీసుకువచ్చి మాట్లాడించటాన్ని ఏమంటారని విమర్శించారు. రాజకీయాలలో ఆయా సామాజిక వర్గాల పట్ల విశ్వసనీయత లేకుండా వ్యవహరించింది మీరు కాదా అని నిప్పులు చెరిగారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారని జస్టిస్ ఈశ్వరయ్య విషయంలో చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఎస్ సీ లలో పుట్టాలని ఎవరనుకుంటారని అన్నది, నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని, మత్యకారులను తాట తీస్తానని అన్న పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధ కృష్ణ మూర్తీ, వైస్ చైర్మన్ జీ. ప్రశాంత్ కుమార్, నాయకులు బొర్రా శ్రీనివాసరావు ,బేతపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయాలతో శానిటేషన్ పనులా ?

విశాలాంధ్ర - రేపల్లె : వైయస్సార్ సంపూర్ణ పోషణ్ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని భట్టిప్రోలు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అక్కడ ఉన్న పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మండలంలోని అమృతలూరు సెక్టార్ పరిధిలోని ఆయాలను ఆ ప్రాంతాన్ని క్లీన్ చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు చెప్పటం సబబు కాదని ఏఐటియుసి నాయకులు పి.నాగాంజనేయులు, జి. బాలాజీలు ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నారు. గర్భవతులు మరియు బాలింతల సౌకర్యార్థం వారి ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు చేసింది. అయితే స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పంపిణీ చేయాల్సిన కిట్లు స్థానిక మార్కెట్ యార్డ్లో పంపిణీ చేయడంతో అక్కడ ఉన్న అధికారులు పంచాయతీ సిబ్బంది చేత పరిసరాలను శుభ్రపరచాల్సి ఉండగా అంగన్వాడి ఆయాలను శుభ్రపరిచేందుకు రమ్మనడం కరెక్ట్ కాదని వారు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదర్ మార్కెట్ యార్డ్ ప్రాంగణాన్ని సంపూర్ణ పోర్షన్ కిట్ల పంపిణీకి అనుకూలంగా ఉండే విధంగా పంచాయతీ శానిటేషన్ సిబ్బంది చేత క్లీన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీడి, మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని ఐసిడిఎస్ హాల్‌లో మంగళవారం జీడిమామిడి, మామిడి సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్.సి.ఎస్.పి. జీడిమామిడి పరిశోధన సంచాలయం పుత్తూరు, కర్ణాటక ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ జీడిమామిడి పరిశోధన పథకంపై జిల్లా ఉద్యానశాఖ అధికారి జెనెమ్మ తెలిపారు.మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పల్లప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ పై మామిడి,జీడిమామిడి మొక్కలను అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని , ఉద్యాన శాఖ అధికారులు కు విజ్ఞప్తి చేశారు.జీడిమామిడి సాగులో వచ్చే పురుగులు, చీడపీడలు గురించి,వాటి నివారణపై డా.నాగేంద్ర రెడ్డి రైతులకు వివరించారు. జీడిమామిడి,మామిడి పంటల యాజమాన్యం గురించి,ఎరువుల యాజమాన్యం గురించి సీనియర్ సైంటిస్ట్ డా. ఉమా మహేశ్వరరావు రైతులకు అవగాహన కలిగించారు.వివిధ పంటల సాగు లో డ్రిప్,స్ప్రింక్లర్, మినీ స్ప్రింక్లర్ ను ఉపయోగించుకొని సక్రమంగా నీటి యాజమాన్యం చేసుకోవచ్చని ప్రభుత్వం సబ్సిడీపై ఈ సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి రమణ తెలిపారు.ఉద్యాన శాఖ తరపున సబ్సిడీ పై ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను మండల ఉద్యాన శాఖ అధికారి అలేఖ్య వివరించి,కొత్తగా జీడిమామిడి, మామిడి రైతులు ఎవరైనా ఉంటేవారి వివరాలు వి.ఏ.ఏ.,వి. హెచ్.ఏ.లకు అందజేస్తే వారికి సబ్సిడీ పథకాన్ని వర్తింప చేసేవిధంగా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు, ఎస్ స్టాఫ్ ఏ పి.ఎం.ఐ పి.స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు .

ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొనాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం నియోజక వర్గంలో జరుగుతున్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని ఆర్డీఓ సరోజిని అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. హౌస్ టు హౌస్ సర్వే వివరాలు, క్లెయిమ్ వివరాలు గురించి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. తహశీల్దార్ ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి, తెలుగు దేశం పార్టీ నుండి కౌతరపు జనార్ధన్ రావు, సీపీఐ నుండి బత్తుల శామ్యూల్, భాజపా నుండి మేడికొండ భరణీరావు, జనసేన నుండి గూడూరు శివరామ ప్రసాద్, సీపీఎం నుండి బాబూరావు, మిగిలిన పార్టీల నుండి ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనపై చర్చ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య ఆర్డీఓ సరోజినిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం గురించి చర్చించారు. జీరో డోర్ నెంబర్‌ల గురించి, డూప్లికేట్ ఓట్లు గురించి, ఒక ప్రదేశపు ఓట్లు మరొక ప్రదేశపు పోలింగ్ బూతుల్లో ఉండటం తదితర విషయాలపై చర్చించారు. వీటిని సరిచేయవలసినదిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దంత పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-చిలకలూరిపేట : డెంటల్ హై జీన్ అవేర్నెస్ డే సందర్భంగా మద్రి చెన్నారెడ్డి ఎలిమెంటరీ స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అమ్మ దంత వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ పేర్ని కృష్ణ మోహన్ మాట్లాడుతూ దంతాలను ఎలా పరిరక్షించుకోవాలన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర - రేపల్లె : గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డిఎస్పి టీ.మురళీకృష్ణ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని భట్టిప్రోలు మండలం ఐలవరం బస్టాండ్ వద్ద మేలం బిందు, తన భర్తతో విడిపోయి ఉంటూ వీరంజనేయులు అను వ్యక్తితో సహా జీవనం సాగిస్తూ ఉన్నదని చెప్పారు. వీరంజనేయులు జిరాక్స్ షాప్ నందు పనిచేస్తూ వచ్చే ఆదాయం సరిపోక గంజాయిని విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. విశాఖపట్నం ఏజన్సీ ప్రాంతాల నుండి గుంటూరుకు తీసుకువచ్చి విక్రయిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో వీరంజనేయులు గంజాయి తీసుకురావడం కోసం ఏజన్సీ ప్రాంతానికి వెళ్లగా 2023 జూన్ 20న కేడిపేట పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్ళిడని తెలిపారు. అయితే భాను, బంటి,సైఫా, శ్రీకాంత్‌లు మొదటి ముద్దాయి బిందుకు ఫోన్ చేసి గంజాయి కావాలని అడుగగా ఆమె తన వద్ద ఉన్న 5 కేజీ గంజాయిని విక్రయిస్తానని చెప్పటంతో గుంటూరులో అయితే అనుమానం వస్తుంన్నదని ఐలవరం గ్రామంలో ఆమె వద్ద నుండి గంజాయి కొనుటకు నిర్ణయించుకుని ముద్దాయిలు భట్టిప్రోలు మండలం ఐలవరం బస్టాండ్ వద్దకు రాగా గంజాయి అమ్ముచున్నట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారముతో నిఘా పెట్టినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టి.మురళికృష్ణ సూచనల మేరకు రేపల్లె పోలీస్ స్టేషన్ సీఐ ఎమ్.నజీర్ బేగ్ వేమూరు యస్.ఐ. జే.నాగరాజు, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది, ముద్దాయిలను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పి మురళీ కృష్ణ తెలిపారు.

తల్లిపాలు శిశువుకు అమృతం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : తల్లిపాలు శిశువుకు అమృతం లాంటివని చందోలు పిహెచ్సి వైద్యులు లోకేష్ అన్నారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చందోలు పిహెచ్సి పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించి, సహకరించి, రక్షించుకోవడానికి ప్రతి సంవత్సరం ఒక క్రొత్త సందేశముతో ఈ వారోత్సవాలు జరుగుచున్నవని తెలిపారు.శిశువులకు ప్రకృతి ప్రసాదించిన సహజ అత్యుత్తమమైన పౌష్టికాహారం తల్లి పాలన్నారు.బిడ్డకు మొదట వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుందన్నారు.శిశువులకు దృష్టిలోపం రాకుండా నివారించడానికి దోహదపడతాయన్నారు.వ్యాధుల బారి నుండి తల్లిపాలు రక్షిస్తుందన్నారు.శిశువు పుట్టిన వెంటనే గంటలోపే తల్లిరొమ్ము అందించి ముర్రుపాలు (కొలస్ట్రం-) తప్పని సరిగా పట్టాలని చెప్పారు.వ్యాధుల నుండి రక్షించే శిశువుకు కావలసిన ఖనిజాలు, మాంసకృత్తులు, విటమిన్ -ఏ సమృద్ధిగా ఉంటాయన్నారు. వ్యాధుల నుండి రక్షించే యాంటీబాడీలు ఉంటాయి. బిడ్డపేగుల నుండి విసర్జకాలను తొలగించడానికి, అలర్జీలు రాకుండా నిరోధించడానికి ముర్రుపాలు తోడ్పడతాయి. ఒక్కమాటలో చెప్పా లంటే ముర్రుపాలలో శిశువుకు కావలసిన అన్ని పోషకవిలువలు బిడ్డ శరీరానికి అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిహెచ్సి వైద్య సిబ్బంది, ఎన్పీహెచ్ఓ నాగేశ్వరరావు, సూపర్వైజర్లు నరసింహారావు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొల్లూరు : కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలించే నైతిక అర్హత కోల్పోయారు అనిసిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగర కొండ అన్నారు. కొల్లూరులో సిపిఐ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. సేవ్ ఇండియా సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అనే నినాదంతో సిపిఐ రాష్ట్ర పార్టీ తలపెట్టిన బస్సు యాత్ర బాపట్ల జిల్లాలోని రేపల్లె లో 26వ తేదీ అద్దంకిలో 28వ తేదీ వస్తున్న సందర్భంగా రేపల్లె రోడ్ షోకు చీరాల బాపట్ల రేపల్లె వేమూరు నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం వచ్చిన తర్వాత తమ సొంత ఎజెండాను అనుసరిస్తూ సాధారణ ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గంటా రాంబాబు, సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ బావిరెడ్డి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు

పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని కొత్తపాలెం పంచాయితీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు జీలుగ తదితర పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణా రెడ్డి చేతుల మీదుగా సరఫరా చేశారు. ఆయన మాట్లాడుతూ యాభై శాతం రాయితీతో ప్రభుత్వం రైతులకు ఈ విత్తనాలను అందిస్తుందని అన్నారు. వీటి ద్వారా వ్యవసాయంలో రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన ఎరువులుగా ఉపయోగ పడతాయి అని అన్నారు. మండల వ్యవసాయ అధికారిణి ఐ సుమతి మాట్లాడుతూ చీరాల మండలానికి ఖరీఫ్ సీజన్లో 34 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. డీ - కృషి యాప్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులకు మే నెల నుండి జూలై నెల వరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు ధీరజ్, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలు రూపుమాపేందుకు జాబ్ మేళాలు

విశాలాంధ్ర - చీరాల : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,ఉపాధి కల్పన కార్యాలయాలు కృషి చేస్తాయని బాపట్ల జిల్లా నైపుణ్యధికారి సుధాకర్ అన్నారు.బుధవారం చీరాల యార్లగడ్డ అన్నపూర్ణ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి సుధాకర్ మాట్లాడుతూ,సంవత్సరిక క్యాలండర్ ను అనుసరించి, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం,ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని అన్నారు. ఈ మినీ జాబ్ మేళా కు 103 మంది హాజరు కాగా అందులో 31 మంది ఉద్యోగాలకు ఏంపిక అయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ బాపట్ల జిల్లా ప్లేసెమెంట్ ఎగ్జిక్యూటివ్ డి రమేష్ బాబు, సిబ్బంది నాగ వెంకట్,హారిక, అనేష్ బాబు,రవి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

సాంబన్న నీ శ్రమ మరువలేనన్న

విశాలాంధ్ర - యద్దనపూడి : సాంబన్న యువగళం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విజయవంతగా జరిగేలా నీవుపడ్డ కృషి కనిపించిందన్నా.. నీశ్రమను మరువలేనన్న అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా, బాపట్ల జిల్లా పాదయాత్రను ముగించుకొని గుంటూరు జిల్లాలోకి పయనం అవుతున్న తరుణంలో ఎమ్మెల్యే ఏలూరు ని అక్కున చేర్చుకొని తన అనుబంధాన్ని చాటుకున్నారు. యువగళం స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో పసుపు జెండా రెపరెపలాడాలని, నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీనీ విజయపథంలో నడిపించాలని యువనేత సూచించినట్లు తెలిపారు.

మణిపూర్ సంఘటనలకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మణిపూర్‌లో జరిగిన సంఘటనలపై మంగళవారం మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం మండల ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్ళి తహశీల్దార్ జి.అంకారావుకు వినతి పత్రం అందజేశారు. మండల ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో గత మూడు నెలలుగా దళితులపై, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిపి వారి ఇళ్లను ధ్వంసం చేయడం దారుణమని అన్నారు.

దిశ సైబర్ కవచ్‌తో సైబర్ మోసాలు కట్టడి

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : సైబర్ మోసాలను కట్టడి చేయడానికి దిశ సైబర్ కవచ్ సాఫ్ట్‌వేర్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వారిని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా రక్షించే విధంగా ఏర్పాటు చేసిన 'దిశ సైబర్ కవచ్ మానిటర్‌ను ఎస్పీ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం "దిశ సైబర్ కవచ్" పని చేస్తున్న విధానాన్ని తెలుసుకొని, మొబైల్ లోని యాప్ లను, డాటాను స్కాన్ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. మొబైల్ ఫోన్‌లు ఎలక్ట్రానిక్ పరికరాలలో మనకు తెలియకుండా నిక్షిప్తమైన వైరస్‌ను గుర్తించడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దిశ సైబర్ కవచ్ అను సరికొత్త పరికరాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాప్‌లు, వైరస్, మాల్‌వేర్‌ను గుర్తించి తొలగించేందుకు సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ ఛార్జింగ్ పిన్ నుంచి యూఎస్‌బీ కేబుల్ ద్వారా దిశ సైబర్ కవచ్ మెషిన్‌కు అనుసంధానం చేస్తే మొబైల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లను, వైరస్‌ను గుర్తిస్తుందన్నారు. మన అవసరాలను ఆసరాగా చేసుకొని ఇటీవల సైబర్ మోసాలు పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏ.ఆర్.డి.ఎస్.పి ఎం.డి.హెచ్ ప్రేమ్ కుమార్, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, పి.బాలమురళి కృష్ణ, వెల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మధరావు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - బల్లికురవ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహి స్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలనరు. ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.

పాస్‌పోర్టు పోయినది

బషీరున్నీసా, భర్త ఇస్మాయిల్ మొహమ్మద్ అను నేను బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామం నివాసినైయున్నాను. అయితే 19-07-2023 తేదీన చందోలు గ్రామంలో ఇల్లు మారే సమయంలో పాస్‌పోర్టు పోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. పాస్‌పోర్టు నెంబరు K 7641562. ఎవరికైనా దొరికిన యెడల సెల్: 8889208883 నెంబరుకు తెలియజేయగలరు.